పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



గడప గడపకు మన ప్రభుత్వంలో దివ్యాంగురాలి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన సోమవారం కానూరు మురళీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు అందిన పథకాల బ్రోచర్ ఇచ్చి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిందని తెలిపారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు సంక్షేమ పథకాలు అమలు చేసి వారి అభివృద్ధికి తోడ్పడుతోందన్నారు. సచివాలయాలు, వలంటీర్లను ఏర్పాటు చేసి ప్రతి ఇంట్లో అర్హులను గుర్తించి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వం ఉచిత విద్య అందుబాటులోకి తీసుకు వచ్చిందని వివరించారు. జగనన్న సీఎంగా ఉంటేనే పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆనందంగా ఉంటాయని తెలిపారు.

రహదారి ప్రారంభం..

కానూరు మురళీనగర్‌లో ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లను ఎమ్మెల్యే పార్థసారథి ప్రారంభించారు. ఈ ప్రాంతంలో దాదాపు రూ 40 లక్షల వ్యయ అంచనాతో సిమెంట్ రోడ్లు నిర్మించారు. గత ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులను తాను కానూరులో చేపట్టానని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు మురళీనగర్‌లో చేస్తామని, కృష్ణా జలాలు సైతం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాడిగడప కమిషనర్ ఎస్.ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, నేరెళ్ల బుజ్జి, చాంద్‌బాషా, తాళ్ల నరేంద్ర, వేమూరి బాలకృష్ణ, విజయ్‌రమేష్, రెహమాన్, అంగిరేకుల సీతారామయ్య, మురళి, కూనపరెడ్డి రమేష్, నర్రా ఆంజనేయ ప్రసాద్, శ్రీరాములు, వరదీష్, లతీఫ్ పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేగంగా రోడ్డు నిర్మాణం



పెనమలూరు: యనమలకుదురు లాకుల వద్ద రోడ్డు నిర్మిస్తున్నారు. యనమలకుదురులో ఈ నెల 17 నుంచి 20 వ తేదీ వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. భక్తుల సౌకర్యార్థం తాడిగడప మునిసిపాలిటి నిధులు సుమారు రూ.8 లక్షలతో లాకుల వద్ద సోమవారం రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశాలతో రోడ్డు నిర్మిస్తున్నామని కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ సాగు పంటల విక్రయాలు

విజయవాడ రూరల్: రూరల్ మండలంలోని నున్నలో ప్రకృతి వ్యవసాయ పంటల ఉత్పత్తుల ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ముందుగా ప్రకృతి వ్యవసాయం పంటల సాగుపై ప్రజలకు గ్రామ సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం పంట ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకువచ్చి విక్రయించారు. వంకాయలు, చిక్కుళ్లు, టమాట, మునక్కాయ, సొరకాయ, అరటి కాయలు తదితర పంట ఉత్పత్తులు, సేంద్రియ పంటలను మార్కెట్‌లో విక్రయించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం

కంకిపాడు: ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15న కోలవెన్నులోని వరసిద్ధి వినాయక కల్యాణ మండపంలో ఉచిత ఆయుర్వేద మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కోలవెన్ను ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి పి.నీలిమ తెలిపారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నిపుణులైన ఆయుర్వేద వైద్యులతో పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారన్నారు. పెయిన్ కేర్, యానోరెక్టల్ కేర్, స్కిన్‌కేర్, మధుమేహం, కిడ్నీ, స్త్రీలు, చిన్న పిల్లల సమస్యలు, అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

అడంగల్‌లో మార్పు కోరుతూ దరఖాస్తు



విజయవాడరూరల్: అడంగల్‌లో మార్పు చేయాలని కోరుతూ ప్రసాదంపాడు గ్రామానికి చెందిన చాగంటిపాటి శ్రీనివాసరావు స్పందన కార్యక్రమంలో రూరల్ మండల తహసీల్దార్‌కు దరఖాస్తును అందజేశారు. సోమవారం ఉదయం 11గంటల నుంచి తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.భార్గవి, హౌసింగ్ డీఈ నాగమల్లేశ్వరావు, వ్యవసాయాధికారి బి.రంగనాధ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో బంగారు పతకం సాధించిన దుర్గారావు



పెనమలూరు: యనమలకుదురుకు చెందిన కరాటే క్రీడాకారుడు బంగారు పతకం సాధించాడు. ఈ నెల 12న హైదరాబాద్‌లో జరిగిన రెండో ఇంటర్నేషనల్ కరాటే, కుంగ్ఫు చాంపియన్‌షిప్-2023లో ఎస్.దుర్గారావు జోసెఫ్ బ్లాక్‌బెల్టు ఇండివిడ్యుల్ కటా 60 సంవత్సరాల విభాగంలో బంగారు పతకం, చాంపియన్‌షిప్ ట్రోఫీని గెలిచాడు. దేశంలో 1500 మంది క్రీడాకారులు పాల్గొనగా దుర్గారావు తన ప్రతిభను చాటాడు.

సీఏ, సీఎంఏ, సీఎస్ కోర్సులతో ఉత్తమ భవిత



ఉయ్యూరు: సీఏ, సీఎంఏ, సీఎస్ కోర్సులకు ఉజ్వల భవిత ఉంటుందని విజయవాడకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ డి.కృష్ణార్జునరావు అన్నారు. పట్టణంలోని ఏజీఅండ్‌ఎస్‌జీ సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం ఆధ్వర్యాన సోమవారం కెరీర్ కౌన్సిలింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. కృష్ణార్జునరావు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని, సీఏ, సీఎంఏ, సీఎస్ కోర్సులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ, వాణిజ్య విభాగాధిపతి ఎస్.వసంతరావు, అధ్యాపకులు కె.శేఖర్‌బాబు, ఎ.ఎస్.ఎల్.మసోహరి, కె.స్వర్ణలత, జి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై టీడీపీ అసత్య ప్రచారం

- కానూరులో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?
- ఎమ్మెల్యే పార్థసారథి సవాల్



కానూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సారథి

పెనమలూరు: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిపై టీడీపీ అసత్య ప్రచారం చేస్తోందని, టీడీపీ నేతలకు దమ్ముంటే కానూరులో జరిగిన అభివృద్ధి పై చర్చకు రావాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సవాల్ చేశారు. కానూరు మురళీనగర్ సచివాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో టీడీపీ తప్పుడు ఆరోపణలపై మండిపడ్డారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధిపై టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను గందరగోళం చేయటానికి కుట్ర పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను మూడున్నరేళ్లలో కానూరులో రూ.35 కోట్లతో అభివృద్ధి పనులు చేశానని చెప్పారు. పేదలకు రూ.207 కోట్ల ఆర్థిక సాయం లబ్ధిదారుల ఖాతాల్లో వేశామన్నారు. మరి టీడీపీ ఐదేళ్ల పాలనలో కానూరు ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పేదలను పేదలుగా ఉంచాలన్నదే టీడీపీ డీఎన్ఏ అని ఆరోపించారు. ప్రజలు కూడా టీడీపీ కుట్రను గ్రహించాలని చెప్పారు.

ఒక వర్గం ఓట్లు చేర్చుతున్నారు

టీడీపీ నేతలు కానూరులో ఉన్నత వర్గాలు ఉండే ప్రాంతాలు, అపార్టుమెంట్‌లకు వెళ్లి పనిగట్టుకుని ఉద్దేశపూర్వకంగా ఒక వర్గం ఓట్లు మాత్రమే చేర్పిస్తున్నారని సారథి ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్లు చేర్పడం లేదని విమర్శించారు. పేదలు పేదలుగానే ఉండిపోవాలని టీడీపీ చేస్తున్న కుట్రలో భాగంగానే ఓట్లు చేర్పులు జరుగుతున్నాయన్నారు. అర్హత ఉన్న అన్ని వర్గాల వారి ఓట్లు చేర్పించాలని తాను అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఉచిత కుళాయి కనెక్షన్లు

గ్రామాల్లో ఉచితంగా కుళాయి కనెక్షన్లు ఇస్తామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. అమృత్ టు పథకం కింద రూ 17 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. దీని ద్వారా 27,400 మందికి ఉచిత కుళాయి కనెక్షన్లు ఇస్తామని తెలిపారు. అలాగే కానూరు, పోరంకి చెరువులను కూడా అభివృద్ధి చేస్తామని అన్నారు.

ఎల్ఐసీ ప్రీమియం చెల్లింపు కార్యాలయంలో చోరీ

పెనమలూరు: కానూరు కామయ్యతోపులోని ఎల్ఐసీ ప్రీమియం చెల్లింపు కార్యాలయంలో చోరీ జరిగింది. కార్యాలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప రాడ్లతో కార్యాలయం తలుపులు ధ్వంసం చేసి తెరిచారు. కార్యాలయం ఇన్‌చార్జి మరీదు ఆంజనేయులు సూట్ కేసు కూడా ధ్వంసం చేశారు. కార్యాలయంలోని స్వల్ప మొత్తం సొమ్ము చోరీ చేశారు. సిబ్బంది కార్యాలయానికి సోమవారం వచ్చి చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి పోలీసులు వచ్చి పరిశీలించి విచారణ చేశారు.

గంగూరులో రూ.కోటితో అభివృద్ధి పనులు



పెనమలూరు: గంగూరులో రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులకు పాలక వర్గం ఆమోదం తెలిపింది. గంగూరు పంచాయతీ సమావేశం సర్పంచి తస్లీమున్నీసా అధ్యక్షతన జరిగింది. గ్రామంలో షాదీఖానా నిర్మాణానికి రూ 50 లక్షలు, రెండు శ్మశాన వాటికల అభివృద్ధికి రూ 25 లక్షలు, మంచి నీటి పైప్‌లైన్‌లు, ప్రధాన రహదారుల అభివృద్ధి, మొక్కలు నాటడం, పాఠశాలకు డిజిటల్ లైబ్రరీ నిర్మాణం తదితర పనులకు తీర్మానం చేశారు.

జాతీయ రహదారులను శుభ్రంగా ఉంచాలి



అధికారులు, సర్పంచితో చర్చిస్తున్న డీపీఓ

కేసరపల్లి(గన్నవరం): జాతీయ రహదారి పరిసరా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచడానికి గ్రామపంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి నాగేశ్వర్‌నాయక్ సూచించారు. కేసరపల్లి ఏలూరు కాల్వ సమీపంలో జాతీయ రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు తొలగింపు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. డీపీవో మాట్లాడుతూ న్నతాధికారుల ఆదేశాలతోనే మోటర్స్ నుంచికేసరపల్లిలోని ఏలూరు కాల్వ వరకు రహదారి క్లీనింగ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో ఈ రహదారిపై అనధికారికంగా చెత్తచెదారం డంప్ చేయడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొందన్నారు. ఈ ప్రాంతంలో మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో చెత్తను డంప్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీఓ కె. వెంకటేశ్వరరావు, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఈవో మౌనిక, పలువురు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కోతుల బెడద నుంచి విముక్తి

కేసరపల్లి గ్రామస్తులు ఎదుర్కొంటున్న కోతుల బెడదకు విముక్తి లభించింది. గ్రామపంచాయతీ తీర్మానం మేరకు సిబ్బంది సుమారు 100 కోతులను పట్టుకుని ఫారెస్ట్ ప్రాంతంలో వదిలిపెట్టారు.

సొసైటీ బాధితులను ఆదుకోండి

ఉంగుటూరు: ఆత్కూరు ప్రాథమిక సహకార సంఘంలో దాచుకున్న డబ్బులను కార్యదర్శి శంకరరావు, క్యాషియర్ శివకుమారి గోల్‌మాల్ చేసిన ఘటనలోని బాధితులకు న్యాయం చేయాలని చేస్తున్న నిరశన దీక్ష సోమవారం 14వ రోజుకు చేరుకుంది. సొసైటీలోని డిపాజిట్లు, నగదును కార్యదర్శి గోల్‌మాల్ చేసినప్పుడు బ్యాంకు అధికారులు విచారణ చేసి సుమారు రూ.3కోట్లు గోల్‌మాల్ చేసినట్లు నిర్ధారించారు. సొసైటీలో డబ్బులు నష్టపోయిన బాధితులకు ప్రజా ప్రతినిధులు, కేడీసీసీ బ్యాంకు అధికారులు నగదు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. బ్యాంకు అధికారులు నగదు చెల్లించ లేదని బాధితులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

కోర్కెలు తీర్చే కల్పవల్లి.. వీరమ్మ





కనక చింతయ్య సమేత వీరమ్మ, ఆకట్టుకున్న డప్పు కళాకారుల విన్యాసాలు

ఉయ్యూరు: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ కనక చింతయ్య సమేత వీరమ్మతల్లికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. తిరునాళ్ల మహోత్సవంలో 14వ రోజు సోమవారం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పొంగలి నైవేద్యం సమర్పించి, కావిళ్లను తీసుకొచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. జోడు పొట్లేళ్ల ప్రభ బండ్లతో డప్పు వాయిద్యాలతో భక్తులు అమ్మ ఆలయ ప్రదక్షిణ పూర్తి చేసి పొట్టేళ్లను కానుకగా సమర్పించారు. డప్పు కళాకారుల ఆట పాటలు, విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం మంగళవారంతో ముగియనుంది. బుధవారం ఉదయం ఆలయం నుంచి పల్లకిలో అమ్మవారు ఊరేగింపుగా బయలుదేరి మెట్టినింటి ప్రవేశం చేస్తారు.

తాగునీటిఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోండి

ఉంగుటూరు: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం సోమవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలన్నారు. జగనన్న లేఅవుట్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.15కోట్లు మంజూరు చేయగా అదనంగా మండల పరిషత్ నుంచి రూ.29 లక్షలు కేటాయించామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు సమావేశంలో తీసుకు వచ్చిన సమస్యలను చర్చించారు. తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయా శాఖల అధికారులను ఎంపీపీ ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రతి లబ్ధిదారు మార్చి నెలాఖారులోగా ఇల్లు నిర్మాణం ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోఆర్‌డీ బాషా, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్లేందుకు వైఎస్సార్ సీపీ నేతలు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సూచించారు. మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలోని ఓ హోటల్‌లో సోమవారం పార్టీ నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కూడా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరువచేయాలని సూచించారు. గ్రామాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ 2024 ఎన్నికల్లో ఘనవిజయం సాధించడానికి కలిసి పనిచేయాలని తెలిపారు. ఎంపీపీ అనగాని రవి, పలువురు పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు. సీఎం దృష్టికి ఎయిర్‌పోర్ట్ నిర్వాసితుల సమస్యలు విమానాశ్రయ విస్తరణలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలను ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. నిర్వాసితులకు ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ కింద గృహ నిర్మాణాలకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎంఓ అధికారులకు ఆదేశాలు కూడా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

ఉంగుటూరు: విజయవాడ నుంచి కాకినాడ రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆత్కూరు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొట్టిపాడు టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ఉన్న ఓ మినీ వ్యాన్‌ను తనిఖీ చేశారు. సుమారు 3.8టన్నుల రేషన్ బియ్యంగా గుర్తించారు. బియ్య తరలిస్తున్న సురేష్, మురళీకృష్ణలను అదుపులోకి తీసుకుని మిని వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు తరలించి ఎస్ఐ సూర్య శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు నిరంతరం పఠనాశక్తి కలిగి ఉండాలని, పుస్తక పఠనంపై అందరికీ అవగాహన కలిగించాలని స్టెల్లా కళాశాల ఇంటర్మీడియట్ విభాగం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రామకృష్ణ పేర్కొన్నారు. కళాశాల నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో జరుగుతున్న పుస్తక మహోత్సవానికి సోమవారం ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుస్తకాలను చదవటం అలవర్చుకోవాలన్నారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానంతోపాటు మానసిక ఉల్లాసం కూడా పెరుగుతుందన్నారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహిళల హక్కులు, చట్టాలపై యువతులకు అవగాహన ఉండాలని దర్శకురాలు యలమంచిలి అంజని చెప్పారు. సోమవారం సరోజిని నాయుడు జయంతి సందర్భంగా సిద్ధార్థ కళాశాలలోని ఎన్‌సీసీ 4(ఏ) గరల్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల సెమినార్ హాల్లో జరిగిన సభకు అంజని ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు అందుబాటులో సర్వీసులు

ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి



యనమలకుదురులో సిటీ సర్వీస్ ప్రారంభిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ పద్మావతి

పెనమలూరు: ప్రయాణికుల అవసరాల మేరకు ఆర్టీసీ సిటీ సర్వీసులు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. ఆమె సోమవారం యనమలకుదురులో ఆర్టీసీ సిటీ బస్సు 7బీని కేఆర్‌మార్కెట్ నుంచి యనమలకుదురుకు ప్రారంభించి బస్సులో ప్రయాణం చేసి అనంతరం వివరాలు వెల్లడించారు. యనమలకుదురుకు కరోనా ముందు వరకు సిటీ సర్వీసు ఉండేదని తెలిపారు. గ్రామానికి సిటీ బస్సు లేక పోవడం.. ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించామన్నారు. కేఆర్ మార్కెట్ నుంచి ఉదయం 7.05, 8.15 గంటలకు, సాయంత్రం 4.40, 6.50 గంటలకు యనమలకుదురు గ్రీన్ సిటీ వరకు బస్సు ఏర్పాటు చేశామని వివరించారు. ప్రయాణికుల డిమాండ్ పెరిగితే మరిన్ని ట్రిప్పులు వేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎం బసవయ్య, వైఎస్సార్ సీపీ నేత ఫజల్ హక్, బీసీ సంఘ ప్రధాన కార్యదర్శి కోసూరి నరేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రాలపై నిర్లక్ష్యం వద్దు

డాక్టర్ ఎం.సంతోష చంద్రిక



కంటి వెలుగు శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ ఎం.సంతోష చంద్రిక

కంకిపాడు: నేత్రాలపై నిర్లక్ష్యం వద్దని ఉప్పలూరు పీహెచ్‌సీ డాక్టర్ ఎం.సంతోష చంద్రిక సూచించారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం సోమవారం ఉప్పలూరు పీహెచ్‌సీలో నిర్వహించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ 110 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ సంతోష చంద్రిక మాట్లాడుతూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ కంటి నుంచి నీరు కారుతున్నా, కళ్లు ఎర్రబడ్డా, పుసి కట్టినా వెంటనే కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ భాస్కర్‌రెడ్డి, పీహెచ్‌ఎన్ పద్మావతి, సిబ్బంది రాచమళ్ల శ్యాంప్రసాద్, షాజిదాబేగం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తెకు తీవ్రగాయాలు

గన్నవరం: రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తె తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని కేసరపల్లి శివారు బుడమేరు కాలువ వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడలోని పటమటకు చెందిన సగ్గుర్తి వీరాంజనేయులు తన కుమార్తె మానసతో కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం గన్నవరంలోని బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి సోమవారం ఉదయం ఇంజినీరింగ్ చదువుతున్న కుమార్తెను పీబీ సిద్ధార్థ కళాశాలలో దించి ఇంటికి వెళ్లేందుకు వీరాంజనేయులు బయలుదేరాడు. కేసరపల్లి శివారు బుడమేరు కాలువ వద్దకు రాగనే వీరాంజనేయులకు ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో వాహనం అదుపుతప్పి బుడమేరు కాలువ రెయిలింగ్‌ను ఢీకొని పడిపోయారు. ఘటనలో తండ్రి, కుమార్తెకు బలమైన గాయాలు కావడంతో 108లో విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరాంజనేయుల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై గన్నవరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా కొరత లేదు

ఏఓ శైలజ



పెదపులిపాకలో వరి సాగును పరిశీలిస్తున్న ఏఓ శైలజ

పెనమలూరు: మండలంలో యూరియా కొరత లేదని రైతులు ఆందోళన చెందొద్దని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె సోమవారం మండలంలోని రైతుభరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. రైతుల అవసరాల మేరకు ప్రభుత్వ ఆదేశాలతో రైతుభరోసా కేంద్రాల్లో యూరియా స్టాకు ఉందని తెలిపారు. రైతులు కంగారు పడి యూరియా నిల్వ ఉంచుకోరాదన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎవరైనా యూరియా ధరలు పెంచి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు పంటలో యూరియా ఎక్కువ వాడితే తెగుళ్ల బెడద ఉంటుదన్నారు. వ్యవసాయ శాఖ సూచనల ప్రకారమే యూరియా వాడాలని తెలిపారు. గ్రామాల్లో పొలాలు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

ఘనంగా మ్యాక్సిల్లోఫేషియల్ సర్జన్స్ డే

గన్నవరం రూరల్: ప్రమాదాలతో విరిగిన ముఖం, దవడలను బాగుజేసేందుకు మ్యాక్సిల్లోఫేషియల్ సర్జరీ ఉపకరిస్తుందని సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు, డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో సోమవారం హెచ్‌ఓడీ డాక్టర్ కోటేశ్వరరావు అధ్యక్షతన మ్యాక్సిల్లోఫేషియల్ సర్జన్స్ డే జరిగింది. ఆయన మాట్లాడుతూ జ్ఞాన దంతాలు తొలగించుట, గ్రహణం మొర్రి, అంగిలి చీలిక, పెదవులను సరిచేయుట తదితర శస్త్ర చికిత్సలు చేయడం ఈ వైద్య విధానంలో సాధ్యమవుతుందని చెప్పారు. మ్యాక్సిల్లోఫేషియల్ సర్జన్స్‌కు అభినందనలు తెలిపారు. నీటి తిత్తి, దవడ కణతులను తొలగించటంలో వస్తున్న సాంకేతిక మార్పులను అధ్యయనం చేయటం ద్వారా మరింత పట్టు సాధించాలని వైద్యులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, ఏవో వై.మధుసూదనరావు, పాలడుగు సాయి, మ్యాక్సిల్లోఫేషియల్ వైద్యులు జి.శ్రీకాంత్, గిరి, విజయలక్ష్మి, శ్వేత, మితిలేశ్వర్, రత్న దీపిక, మేఘన తదితరులు పాల్గొన్నారు. వారం రోజులపాటు దంత వైద్య విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు డాక్టర్ నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు.

నాయకత్వ లక్షణాలపై యువతకు శిక్షణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ వాహిని అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాల శాఖ, నెహ్రూ యువకేంద్రం (విజయవాడ) ఆధ్వర్యంలో 'యువత నాయకత్వ లక్షణాలు, కమ్యూనిటీ డెవలప్‌మెంట్' అనే అంశంపై మూడు రోజుల శిక్షణ ఏర్పాటు చేశారు. బాపులపాడు మండలం బొమ్ములూరులోని గ్లోబల్ ఎంబీఏ కాలేజీలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఏఎంసీ డైరెక్టర్ గండేపూడి రాణి సోమవారం ప్రారంభించారు. డాక్టర్ వాహిని మాట్లాడుతూ యువత రాజకీయాల వైపు ఆకర్షితులు కావాలని, దీంతో సమాజంలో మార్పు సాధ్యమని చెప్పారు. జిల్లా యువజన అధికారి సుంకర రాము, డీడీఈజీకేవై ఆర్‌ఎం ఎంవీ శ్రీనివాస్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ భీమాల వినోద్ కుమార్ పాల్గొన్నారు.

తిరునాళ్లలో త్రుటిలో తప్పిన ప్రమాదం

ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్లలో భక్తుల అప్రమత్తతతో పెనుప్రమాదం తప్పింది. ఆలయం ముందు భాగాన ఏర్పాటుచేసిన ఆర్చ్‌కు షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిసిపడ్డాయి. తిరునాళ్ల ప్రాంతంలో అగ్నిమాపక వాహనం లేకపోవటంతో భక్తులే దుమ్ము, ఇసుకను, బుసకను ఆర్చ్‌పై విసిరి మంటలను అదుపుచేశారు.